సాక్షి
వికారాబాద్
ఆదివారం । 20 । జూలై । 2025



పౌష్టికాహారంతోనే ఆరోగ్యం
ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర ప్రసాద్ సూచించారు. 8లో▸



శివరాంనగర్‌లో బోనాలు
వికారాబాద్ పట్టణంలోని శివరాంనగర్ కాలనీలో బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. 8లో▸



పెచ్చులూడుతున్న..
దౌల్తాబాద్ మండలం తిర్మాలాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల గదులు పెచ్చులూడి పడుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: పరిగి ఆర్టీసీ డిపోలో మూడు సంవత్సరాల అప్రెంటీస్ విధానంలో పని చేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు డీఎం సుఖేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటీపీఐఎస్, బ్యాక్ అఫ్, డేటా ఫీడింగ్, సిస్టమ్‌కు సంబంధించిన పనులను డిపోలో చేయాల్సి ఉంటుందని తెలిపారు. 2020 తర్వాత డిగ్రీ పూర్తి చేసి 30 సంవత్సరాల లోపు వారు అర్హులన్నారు. ఐటీ, కంప్యూటర్ సైన్స్, గణితంతో గ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు పరిగి ఆర్టీసీ డీపో, లేదా సెల్ నంబర్ 9347163847, 7569065644లలో సంప్రదించాలన్నారు.

రైతుల రుణం తీర్చుకుందాం

ఏడీఏ రుద్రమూర్తి



ఏడీఏ రుద్రమూర్తిని సన్మానించిన ఏవో, ఏఈవోలు

తాండూరు రూరల్: నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించి అన్నదాతల రుణం తీర్చుకుందామని ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. పాదోన్నతి బదిలీపై కుమురంభీం ఆసీఫాబాద్ జిల్లాకు డీడీగా వెళ్తున్న ఆయన్ను శనివారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రుద్రమూర్తి మాట్లాడుతూ.. అన్నీ ఉద్యోగుల కంటే వ్యవసాయశాఖను అదృష్టంగా భావించాలన్నారు. ఈ కొలువు చేస్తే రైతులతో మంచి సంబంధాలు ఏర్పడతాయని తెలిపారు. రైతులకు సేవచేసే భాగ్యం మనకు రావడం అదృష్టంగా భావించాలన్నారు.కార్యక్రమంలో ఏవోలు కొమురయ్య, పవన్ ప్రీతం, శ్వేతారాణి, అనిత, ఏఈవోలు, ఎరువుల దుకాణం డీలర్లు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించాలి



మంత్రి గడ్డం వివేక్‌ను కలిసిన జిల్లా నాయకులు

కుల్కచర్ల: రానున్న స్థానిక ఎన్నికల్లో మాలలకు ప్రాధాన్యత కల్పించేలా చూడాలని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడుచౌడాపూర్ వెంకటేష్ కోరారు.శనివారం మంత్రి గడ్డం వివేక్‌ను ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని వారి అభ్యున్నతికి రానున్న ఎన్నికల్లో ప్రభుత్వ, పార్టీ పరంగా సముచిత స్థానం దక్కేలా చూడాలని కోరారు.

సమాజాన్ని మార్చే శక్తి గురువుకే ఉంది

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్

అనంతగిరి: సమాజాన్ని మార్చే శక్తి గురువుకే ఉందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎన్.శంకర్ అన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియమితులై జిల్లాలో చేరిన 43 మంది ఉపన్యాసకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇంటర్ విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయన్నారు. పరిస్థితులకు అనుగుణంగా బోధనలో వినూత్న పద్ధతులు అవలంబించాలని సూచించారు. కళాశాలల్లో మౌలిక వసతుల కోసం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు తూడి హన్మంత్ రెడ్డి, భాస్కర యోగి, రాజ్కుమార్, మంజుల పాల్గొన్నారు.

రేపటి ప్రజావాణి రద్దు

అనంతగిరి: బోనాల పండుగ సందర్భంగా ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించినందున ఆ రోజు నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి విషయాలన్ని జిల్లా ప్రజల గమణించి కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

దరఖాస్తు చేసుకోండి

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 - 26 విద్యా సంవత్సరానికిగాను అతిథి అధ్యాపక పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వాణిజ్య శాస్త్రం, తెలుగు, జంతు శాస్త్రం సబ్జెక్టులలో 2 పోస్టులు, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఇంగ్లిష్, హిందీ, పొలిటికల్ సైన్స్ విభాగాల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీ ఉన్నట్లు తెలిపారు. పీజీలో ఓసీ, బీసీలకు 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

భారీ ప్రక్షాళన

జిల్లాలో 35 మంది ఎస్‌ఐల బదిలీ



కొత్తగా బాధ్యతలు తీసుకోనున్న ఎస్‌ఐలు

- 12 మంది ఎస్‌హెచ్‌ఓలకు స్థానచలనం
- అన్ని పోలీస్ స్టేషన్లలో కొత్త ముఖాలే
- మొదటిసారి ఎస్‌హెచ్‌ఓలుగా నలుగురు మహిళా ఎస్‌ఐలు
- స్థానిక ఎన్నికలు ముగిసే వరకు పోస్టింగుల్లో కొనసాగే అవకాశం

వికారాబాద్: పోలీసు శాఖలో భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ఏకంగా 35మంది ఎస్‌ఐలను బదిలీ చేశారు. మెజార్టీ పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలను మారుస్తూ కొత్తవారికి పోస్టింగ్ ఇచ్చారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా భారీ సంఖ్యలో ఎస్‌ఐలను బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో మొత్తం 21 పోలీస్ స్టేషన్లు ఉండగా ఇందులో వికారాబాద్, తాండూరు, వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్లకు ఇన్‌స్పెక్టర్ ర్యాంక్ అధికారులు ఎస్‌హెచ్‌ఓలుగా కొనసాగుతున్నారు. మిగతా 18 స్టేషన్లకు సబ్ ఇన్‌స్పెక్టర్ ర్యాంక్ అధికారులు ఎస్‌హెచ్‌ఓలుగా ఉంటున్నారు. వీరి స్థానంలో ప్రొబెషనరి పీరియడ్ పూర్తి చేసుకున్న 2024 బ్యాచ్‌కు చెందిన 12 మంది ఎస్‌ఐలకు పోస్టింగ్ ఇచ్చారు. మిగతా ఆరు స్టేషన్లలో కూడా కొత్త వారే రెండు నెలల క్రితం పోస్టింగ్ తీసుకున్నారు. దీంతో సీఐలు ఎస్‌హెచ్‌ఓలుగా ఉన్న స్టేషన్లు మినహా జిల్లాలోని 18 పోలీస్ స్టేషన్లలో కొత్తవారినే నియమించినట్టయ్యింది. స్థానిక ఎన్నికలు ముగిసే వరకు వీరు కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

వ్యూహాత్మకంగా..

సీఐలు ఎస్‌హెచ్‌ఓలుగా ఉన్న మూడు పోలీస్ స్టేషన్లు మినహా మిగిలిన 18 స్టేషన్లలో ఎస్‌హెచ్‌ఓలుగా కొత్తవారిని నియమించటం ద్వారా ఉన్నతాధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. కొంతకాలంగా జిల్లాలోని పలువురు ఎస్‌హెచ్‌ఓలపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. ల్యాండ్ సెటిల్‌మెంట్లు, ఇసుక దందాల్లో తలదూర్చినట్లు విమర్శలు వచ్చాయి. అంతేకాకుండా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో అంటకాగుతూ వస్తున్నారనే అపవాదు మూటగట్టుకున్నారు. ఇలాంటి వారిని ఎస్‌హెచ్‌ఓలుగా తప్పిద్దామంటే ప్రజా ప్రతినిధుల అండదండలతో అవే పోస్టుల్లో కొనసాగుతూ వస్తున్నారు. ఈ వ్యవహారం పోలీసు ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో ఎస్‌ఐలుగా ఎంపికై ప్రొబెషనరీ పీరియడ్ పూర్తి చేసుకున్న వారికి తప్పనిసరిగా ఎస్‌హెచ్‌ఓలుగా పోస్టింగ్ ఇవ్వాలనే నిబంధన ఉండటంతో 2024 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐలకు అవకాశం కల్పించి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. పాతవారందరినీ మారుస్తూ జిల్లాలోని రూరల్ పోలీస్ స్టేషన్లలో కొత్తవారికి అవకాశం కల్పించారు. దీంతో ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నచందగా అధికారులు వ్యవహరించారు.

మహిళా ఎస్‌ఐలకు పెద్దపీట

ప్రస్తుత బదిలీల్లో మహిళా ఎస్‌ఐలు జాక్‌పాట్ కొట్టారు. జిల్లా చరిత్రలో మొదటి సారి నాలుగు పీఎస్‌లకు మహిళా ఎస్‌ఐలు ఎస్‌హెచ్‌ఓలుగా నియమించారు. వికారాబాద్ జిల్లాగా ఏర్పాటు కాకముందు నుంచే పశ్చిమ రంగారెడ్డి జిల్లా పరిధిలోని 20 ఠాణాలతో వికారాబాద్‌లో ఎస్పీ కార్యాలయం ఉండేది. గడిచిన రెండు దశాబ్దాల కాలంలో వికారాబాద్ జిల్లాలో నలుగురికి మాత్రమే ఎస్‌హెచ్‌ఓలుగా బాధ్యతలు అప్పగించారు. ఇందులో లక్ష్మి మాధవి నవాబుపేట ఎస్‌ఐగా, వికారాబాద్ ఎస్‌ఐగా పురుషులకు దీటుగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించి శభాష్ అనిపించుకున్నారు. అనంతరం హర్ష భార్గవి ధారూరు ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు నిర్వహించారు. వీరు మాత్రమే జనరల్ పోలీస్ స్టేషన్లలో ఎస్‌హెచ్‌ఓలుగా పని చేయగా మరో ఇద్దరు ప్రమీల, రేణుకారెడ్డి మహిళా పోలీస్ స్టేషన్‌లలో ఎస్‌హెచ్‌ఓలుగా విధులు నిర్వహించారు. ఓవరాల్‌గా చూస్తే ఈ నలుగురు మాత్రమే గడిచిన ఇరవై ఏళ్లలో ఎస్‌హెచ్‌ఓలుగా పని చేశారు. ఇదే విషయమై ఇటీవల సాక్షి దినపత్రికలో ఎందుకీ వివక్ష అనే శీర్షికన కథనం ప్రచురితమైన వారం లోపే ఒకరికి, నెల లోపు మరొకరికి ప్రస్తుత ఎస్పీ నారాయణరెడ్డి ఎస్‌హెచ్‌ఓలుగా అవకాశం కల్పించారు. తాజాగా ఇచ్చిన పోస్టింగుల్లో మరో ఇద్దరు మహిళా ఎస్‌ఐలకు ఎస్‌హెచ్‌ఓలుగా పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం బంట్వారం, కోట్‌పల్లి, కొడంగల్, కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్లలో మహిళా ఎస్‌ఐలు ఎస్‌హెచ్‌ఓలుగా కొనసాగనున్నారు. ఇదే సమయంలో జిల్లా నుంచి కీలక పదవుల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు, జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లాలో పర్యవేక్షణాధికారులుగా ఉన్న సీఐలు, డీఎస్పీలు సైతం మహిళా ఎస్‌ఐల విధి నిర్వహణకు సహకరించాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

బాధ్యతగా పనిచేయండి

అనంతగిరి: కొత్తగా విధుల్లో చేరనున్న అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తేవాలని ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. కొత్తగా బాధ్యతలు తీసుకుంటున్న ఎస్‌ఐలతో శనివారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జిల్లాకు వచ్చిన 15 మంది ప్రొబేషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్లు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. వారికి పోస్టింగ్ కేటాయించినట్లు పేర్కొన్నారు. పరిపాలనా సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మొత్తం 35 మంది ఎస్‌ఐలకు స్థానాచలనం చేసినట్లు వివరించారు. జిల్లా పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి , శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని, వారి సమస్యలను సానుకూలంగా వింటూ, చట్ట పరిధిలో పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా(డీటీసీ) అదనపు ఎస్పీ పీవీ మురళీధర్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, నూతన ఎస్‌ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి



పారువేట మండపంలో పూజలు చేస్తున్న తిరుమల అర్చకులు

పవిత్రోత్సవాలకు అంకురార్పణ

- శ్రీవారి నిజరూప దర్శనం
- విశేష అలంకరణలో స్వామివారు
- తిరుమల అర్చకుల ఆధ్వర్యంలో పూజలు

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలకు శనివారం రాత్రి అంకురార్పణ చేశారు. తిరుమల నుంచి వచ్చిన అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకుల్లో ఒకరైన వైఖానస ఆగమ శాస్త్ర ముఖ్య సలహాదారులు దివంగత సుందర వరద భట్టాచార్యుల కుమారుల ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి 7 గంటలకు ఆచార్య వచణం, సేనాధిపతి ఉత్సవం, మత్సం గ్రహణం, అంకురార్పణం , వేదారంభంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. స్వామివారి మూలమూర్తికి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు. బాలాజీనగర్‌లోని శ్రీవారి ఆలయం నుంచి సేనాధిపతి ఉత్సవం ఊరేగింపుగా బయలు దేరి శాంతినగర్ కాలనీలోని పారువేట మంటపానికి చేరుకుంది. అక్కడ ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి వరహాస్వామి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన యాగశాలకు వచ్చి పూజలు చేశారు.

నిజరూప దర్శనం

పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం స్వామి వారు నిజ రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిత్య పూజలు, కైంకర్యాలు జరిగాయి. విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. పాలు, పెరుగు, తేనే, నెయ్యి, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



విశేష అలంకరణలో శ్రీవారు

మూడు రోజులపాటు హోమాలు

ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజుల పాటు యాగశాలలో హోమాలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రాత్రి 7నుంచి 9 గంటల వరకు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 9గంటలకు ఉత్సవ మూర్తులకు శత కళశ తిరుమంజనం, మధ్యాహ్నం 12గంటలకు అగ్ని ప్రతిష్ఠ, విశేష హోమాలు, పవిత్ర ప్రతిష్ఠ, రాత్రి 7గంటలకు కుంభావాహన, విశేష హోమాలు, సోమవారం ఉదయం 9గంటలకు విశేష ఉక్త హోమాలు, పవిత్ర సమర్పణ, రాత్రి 8గంటలకు విశేష హోమాలు, మంగళవారం ఉదయం 9గంటలకు విశేష హోమాలతో పాటు పవిత్రోత్సవం, అష్టోత్ర శత అష్టదళ పద్మారాధన, పవిత్రోత్సవ మహా పూర్ణాహుతి, రాత్రి 7 గంటలకు కుంభ బింబ ప్రదక్షిణం, ప్రోక్షణ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

- విద్యార్థులకు ఇబ్బంది కలిగితే అధికారులదే బాధ్యత
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థి సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ ప్రతీక్ జైన్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలు, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, వన మహోత్సవం, నర్సరీల నిర్వహణ, సన్న బియ్యం పంపిణీ తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల ప్రత్యేక అధికారులు వసతి గృహాలను సందర్శించి సమస్యలు ఉంటే తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. మెనూ కచ్చితంగా అమలయ్యేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. బిలను వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇచ్చిన వన మహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాల ని ఆదేశించారు. పెద్ద మొత్తంలో ఈత మొక్కలు నాటాలన్నారు. నర్సరీలను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, ఎం.సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, మండలాల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన చేయాలి

- వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయండి
- మైనారిటీ రెసిడెన్సియల్ విద్యా సంస్థల సెక్రటరీ షఫీవుల్లా

దుద్యాల్: గురుకుల విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయడంతోపాటు ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని తెలంగాణ మైనారిటీ రెసిడెన్సియల్ విద్యా సంస్థల సెక్రటరీ షఫీవుల్లా అన్నారు. శనివారం మండలంలోని చిలుముల మైల్వార్ గ్రామంలోని మైనారిటీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో వసతులు బాగున్నాయని, బోధనలో వెనుకడుగు వేయరాదని సూచించారు. విద్యార్థుల భోజన విషయంలో రాజీ పడరాదన్నారు. రుచికరమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్ రాఘవేందర్ గౌడ్‌కు సూచించారు. ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, ఆర్ఎల్‌సీ శ్రీనివాస్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ జహీర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న షఫీవుల్లా

ఉధృతంగా వీరణ్ణ వాగు

- కల్వర్టు పైనుంచి వరద
- మర్పల్లి - మోమిన్‌పేట్ మధ్య స్తంభించిన రాకపోకలు
- రెండు గంటల పాటు అవస్థలు

మర్పల్లి: మండలంలోని సిరిపురం, వీర్లపల్లి, మోమిన్‌పేట్ మండలం ఎనికేపల్లి గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పంట పొలాలు నీట మునిగాయి. రోడ్లు జలమయ్యాయి. సిరిపురం సమీపంలోని వీరణ్ణ వాగు ఉధృతంగా ప్రవహించింది. కల్వర్టు పైనుంచి భారీగా వరద నీరు పారడంతో రెండు గంటల పాటు రాకపోకలు స్తంభించిపోయాయి. వాగుకు రెండు వైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ధారూరు మండలంలో..

ధారూరు: మండలంలో శనివారం 49.2 మిల్లీ లీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే పెద్ద వర్షం. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాల్లో నీరు నిలిచింది.

నవాబుపేటలో భారీ వర్షం

నవాబుపేట: మండలంలోని ఎత్రాజ్ పల్లి, చిట్టిగిద్ద, పులుమామిడి, లింగంపల్లి, ఎల్లకొండ తదితర గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. శుక్ర, శనివారాల్లో 10 సెంటి మెటర్ల వర్ష పాతం నమోదైనట్లు తెలిసింది. ప్రస్తుత వర్షాలతో పంటలకు జీవం పోసినట్లుయ్యింది.



మర్పల్లి: ఉధృతంగా ప్రవహిస్తున్న వీరణ్ణ వాగు

బస్సులు లేక విద్యార్థుల గోస

- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- పాఠశాలకు ఆలస్యంగా వెళ్తున్న విద్యార్థులు

కొడంగల్: బస్సు లేదు.. చదువు రాదు అన్న చందంగా మారింది గ్రామీణ ప్రాంత విద్యార్థుల పరిస్థితి. సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఆర్టీసీ అధికారుల తీరు ఇలా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి చదువుకోడానికి కొడంగల్‌కు వచ్చే విద్యార్థులు ప్రతి రోజూ గంటకు పైగా ఆలస్యంగా వస్తున్నారని ఎంఈఓ రాం రెడ్డి తెలిపారు. సమయానికి విద్యార్థులు పాఠశాలకు రాకపోవడం వల్ల ఉదయం పూట టిఫిన్ తిన లేకపోతున్నారని అన్నారు. పాఠశాల సమయానికి విద్యార్థుల కోసం బస్సులు నడపాలని పలుమార్లు ఆర్టీసీ డిపో మేనేజర్లను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. మండల పరిధిలో ఐదువేలకు పైగా జనాభా ఉన్న రుద్రారం గ్రామానికి సైతం పాఠశాల సమయంలో బస్సులు లేవని తెలిపారు. విద్యార్థులు కొడంగల్‌కు వచ్చి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రుద్రారంతో పాటు నీటూరు, అప్పాయిపల్లి గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం లేదన్నారు. ఆయా గ్రామాలకు ఉదయం 8.45 నిమిషాలకు, సాయంత్రం 4.40 నిమిషాలకు బస్సులు నడిపించాలని తాండూరు, పరిగి డిపో మేనేజర్లను పలుమార్లు కోరినట్లు తెలిపారు. పాఠశాల సమయానికి ఉదయం ఒక ట్రిప్పు, సాయంత్రం ఒక ట్రిప్పు నడిపిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. కొడంగల్ నుంచి రుద్రారం వెళ్లే మార్గంలో చిట్లపల్లి, సంగాయిపల్లి, అంగడిరాయిచూర్, లక్ష్మీపల్లి,టేకుల్‌కోడ్, అన్నారం,నాగారం గ్రామాలు ఉన్నాయి. ఈ మార్గంలో బస్సు నడపడం ద్వారా ధర్మాపూర్, పాటిమీదిపల్లి గ్రామాల విద్యార్థులకు, ప్రజలకు కూడా మేలు కలుగుతుంది.



పాఠశాలకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు

ఆర్టీసీ కంట్రోలర్ల ఇష్టారాజ్యం: సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

తాండూరు టౌన్: తాండూరు ఆర్టీసీ డిపోలో కంట్రోలర్లు రఘుపతి, శంకర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఆరోపించారు. విద్యార్థులు స్కూల్‌కు వెళ్లే సమయంలో బస్సులు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికంగా ఆదాయం వచ్చే రూట్లలోనే ఎక్కువగా బస్సులు నడుపుతూ కంట్రోలర్లు విద్యార్థులు, మహిళలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నారని ఆరోపించారు. అధికారుల తీరును వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం డిపో ఎదుట నిరశనకు దిగారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వచ్చే సమయాల్లో కాకుండా ముందు లేదా ఆలస్యంగా బస్సులు నడుపుతూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ప్రభుత్వం అందుకు తగిన విధంగా బస్సు సర్వీసులను పెంచలేదన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల మీద టార్గెట్లు పెట్టి అధికారులు వారిని తీవ్ర మానసిక వ్యథకు గురి చేస్తున్నారన్నారు. ఇద్దరు కంట్రోలర్లు ట్రాన్స్‌ఫర్ అయినప్పటికీ రిలీవ్ కాకుండా ఇక్కడే తిష్ట వేశారన్నారు. ఇప్పటికైనా డిపో మేనేజర్ స్పందించి విద్యార్థుల సమయానికి అనుకూలంగా బస్సులు నడపాలని, వెంటనే మరిన్ని బస్సు సర్వీసులను పెంచాలని, బస్టాండ్‌లో సౌకర్యాలను మెరుగు పరచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నిరశన కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు చంద్రయ్య, బాలప్ప, రఘుపతి, ప్రయాణికులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తాండూరు ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

క్లుప్తంగా

జాతీయ రహదారి విస్తరణపై సమావేశం



రోడ్డు విస్తరణ పనులగురించి చర్చిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

పరిగి: అప్పా జంక్షన్ నుంచి మన్నేగూడ వరకు 163 జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులపై ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శనివారం తెలంగాణ సెక్రటేరియట్‌లో సీఎం ప్రిన్సిపాల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, నేషనల్ హైవే ఉన్నత అధికారులతో విస్తరణ పనుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితుడు

అనంతగిరి: వికారాబాద్‌లో ఎక్సైజ్ పోలీసులు శనివారం గంజాయి పట్టుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీం మున్సిపల్ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్‌లోని ఓ నివాసంలో సోదాలు నిర్వహించారు. అక్కడ తాజోద్దీన్ అనే వ్యక్తి వద్ద 540 గ్రాముల ఎండు గంజాయి పట్టుకున్నారు. వెంటనే అతనిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్, ప్రేంకుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, హన్మంతు, రవికిరణ్, మహేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను కేంద్రానికి వివరించండి

ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరిన విశ్రాంత ఉద్యోగులు



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశాంత్ర ఉద్యోగులు

యాచారం: పెన్షనర్ల సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయీస్, ఉపాధ్యాయ సంఘం నేతలు కోరారు. శనివారం నగరంలోని ఈటల రాజేందర్ నివాసంలో ఎంపీని కలిసి 2025 ఆర్థిక బిల్లుతో పెన్షనర్లకు కలిగే నష్టాలను వివరించారు. బిల్లులో మార్పులు చేపట్టాలని లేదంటే నిలిపివేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈటెల రాజేందర్ కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వినోద్‌కుమార్, శ్రీనువాస్, లిక్కి అనురుద్రరెడ్డి, పున్న నర్సింహ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ సీఎంకు ఆచారి శుభాకాంక్షలు

కడ్తాల్: జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి శనివారం ఉదయం ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె జన్మదినం సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర ప్రసాద్



కొడంగల్: మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఉమా శంకర ప్రసాద్

కొడంగల్: ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండొచ్చని తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గది, మధ్యాహ్న భోజనం వండే పాత్రలను చూసి నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన కొత్త పాత్రల్లోనే వంట చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన భోజనం పెట్టాలని సూచించారు. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయురాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, హెచ్ఎం ప్రియదర్శిని పాల్గొన్నారు.

త్వరగా భూసేకరణ పూర్తి చేయాలి

దుద్యాల్: హకీంపేట్, లగచర్ల, పోలేపల్లి గ్రామాల పరిధిలో ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక వాడకు రైతులు అందించిన భూములను తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ శనివారం పరిశీలించారు. సేకరించిన భూములకు సంబంధించిన హద్దులను తహసీల్దార్ కిషన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక వాడ ఏర్పాటులో భాగంగా రైతులు స్వీయ అంగీకారంతో నేటి వరకు అందించిన భూములకు సంబంధించి హద్దులను పకడ్బందీగా గుర్తించి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. ఇంకా రావల్సిన భూములకు కూడా రైతులతో మాట్లాడి పరిశ్రమలకు ఇచ్చేల చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌కు సూచించారు. ఆయన వెంబడి ఆర్ఐ నవీన్ కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివరాంనగర్ కాలనీలో బోనాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శివరాంనగర్ కాలనీలో బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్‌కుమార్, నాయకులు లక్ష్మణ్, పరుశురాంనాయక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: శివరాంనగర్‌లో నాయకులు

తాండూరు టౌన్‌లో..

తాండూరు టౌన్: ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని నేతాజీ గురుదేవ్ గురుకుల్ పాఠశాలలో బోనాలు నిర్వహించారు. శనివారం బాలికలు బోనాల ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. పలువురు బాలురు పోతరాజు వేషధారణలో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మణిమాల మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలని పేర్కొన్నారు. ఈ సంప్రదాయాన్ని విద్యార్థులకు తెలియపరచాలనే ఉద్దేశ్యంతో నిర్వహించామన్నారు.



తాండూరు టౌన్: చిన్నారుల వేషధారణ

టీటీడీ నుంచి నిధులు ఇప్పించండి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరిన కుర్మిద్ద గ్రామస్తులు



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కుర్మిద్ద గ్రామస్తులు

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామస్తులు శనివారం ఉదయం నగరంలో కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని కలిశారు. గ్రామంలోని రమా సత్యనారాయణస్వామి దేవాలయాన్ని నిర్మిస్తున్నామని ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బందె మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గొట్టే మల్లేశ్, మాజీ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాల్కోనిగుట్ట తండావాసులు

కేశంపేట: మండల పరిధిలోని సంగెం రెవెన్యూ పరిధిలోని పాల్కోనిగుట్ట తండాలో వీవీఆర్ వెంచర్‌లో రోడ్డు కబ్జాకు గురైనట్టు గ్రామస్తులు తహసీల్దార్ అజాంఅలీకి ఫిర్యాదు చేశారు. గతంలో సంగెం రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్లు 40, 41, 42, 43, 44లో వ్యవసాయ భూమిని వీవీఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు కొనుగోలు చేసి వెంచర్ వేశారని.. ప్లాట్లు పూర్తి స్థాయిలో అమ్మకాలు జరగకపోవడంతో అట్టి వెంచర్‌లోని ప్లాట్లను మళ్లీ వ్యవసాయభూమిగా విక్రయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంచర్‌లో రోడ్లతో పాటుగా ఐదు గుంటల భూమిని వదిలేయడంతో పల్లె ప్రకృతి వనం ఏర్పాటుచేశామన్నారు. ప్రస్తుతం వెంచర్ హద్దులను చేరిపివేయడంతో పల్లె ప్రకృతి వనానికి వెళ్లేందుకు రోడ్డు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంచర్‌లోని రోడ్లుతో పాటుగా పల్లె ప్రకృతి వనం రోడ్డును కబ్జా నుంచి తొలగించాలని ఫిర్యాదులో కోరారు. ఈ కార్యక్రమంలో తారాసింగ్, రవి, రాజేష్, సాయికుమార్, శంకర్, శ్రీను, రాజేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ భద్రతకే కార్డన్ సెర్చ్

శంషాబాద్ డీసీపీ రాజేశ్



సీజ్ చేసిన ద్విచక్రవాహనాలను పరిశీలిస్తున్న డీసీపీ రాజేశ్

నందిగామ: సమాజ భద్రత కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. శనివారం నందిగామ, అంతిరెడ్డిగూడ శివారులోని పృథ్వీకాలనీ, అయ్యప్ప స్వామి దేవాలయం పరిసర ప్రాంతాలలో నందిగామ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కిరణా దుకాణాలు, పాన్‌షాపులు, వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శంషాబాద్ డీసీపీ రాజేశ్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో తొమ్మిది హాట్‌స్పాట్‌లను గుర్తించి కార్డన్ సెర్చ్ నిర్వహించామని చెప్పారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 42 ద్విచక్రవాహనాలు, నాలుగుచోట్ల గ్యాస్ రీ ఫిల్లింగ్ చేస్తున్నట్లు గుర్తించి 37 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశామన్నారు. నాలుగు బెల్టు షాపుల్లో మద్యం, 8 కేజీల గుట్కా ప్యాకెట్లను, 285 గ్రాముల గంజాయి స్వాధీనం, ఓ పరిశ్రమలో పనిచేస్తున్న బాల కార్మికుడిని గుర్తించామని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, ఏసీపీ శ్రీకాంత్ గౌడ్, ఆరుగురు సీఐలు, పదిమంది ఎస్ఐలు, 20మంది ఏఎస్ఐలు, 35 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 170 మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రైతులకు మూడింతల పరిహారం

- కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి
- నాగిరెడ్డిపల్లిలో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కు కోసం భూ సేకరణ గ్రామసభ

మహేశ్వరం: నాగిరెడ్డిపల్లిలో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కు కోసం భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం మార్కెట్ ధరతో మూడింతల పరిహారం చెల్లిస్తుందని కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోతున్న రైతులతో శనివారం భూసేకరణకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం మండల పరిధిలో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం సీలింగ్ భూమి 9,10,4849,50,51,53,54,63,66,110,144,162,163 సర్వే నంబర్లలో మొత్తం 195.5 ఎకరాలు, సర్వే నంబర్ 55,56,57,64,65లో 55.28 ఎకరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. త్వరలో సర్వే చేస్తామని, రైతులు అధికారులకు సహకరించాలన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం తక్కువగా ఉందని మరింత పెంచి ఇవ్వాలని, కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని రైతులు కోరారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, టీజీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను తప్పించి..

ఎంసీహెచ్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు

తాండూరు: తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను తప్పించి ఎంసీహెచ్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. తాండూరు జిల్లా ఆస్పత్రిలో ఏడాదిగా వినయ్‌కుమార్ అర్థో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత నెల హాస్పిటల్ సూపరింటెండెండ్ ఉన్న దర్మిది రవిశంకర్ వ్యక్తిగత కారణాల వల్ల బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఆయన స్థానంలో 37 రోజుల క్రితం వినయ్ కుమార్‌ను సూపరింటెండెండ్ నియమిస్తూ వైద్య విధాన పరిషత్ ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి ఆయన కొనసాగుతున్నారు. శుక్రవారం ఉదయం ఎప్పటిలాగే ఆస్పత్రిలోని తన చాంబర్‌కు వెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది వైద్య విధాన పరిషత్ నుంచి వచ్చిన ఉత్తర్వులను చూపించారు. అందులో జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెండ్‌గా ఎంసీహెచ్ ఆస్పత్రి సూపరింటెండెండ్ డాక్టర్ సునితను నియమించినట్లు ఉండటం చూసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే వినయ్‌కుమార్‌ను ఎందుకు తొలగించారో తెలియడం లేదు.

బాలికల సంరక్షణ కోసం కృషి చేద్దాం

మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి



వెళ్తున్న బాలికతో మాట్లాడుతున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: బాలికా శిశు సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, అప్పుడే సమాజం బాగుంటుందని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని రహదారుల వెంట శనివారం పోలీసు బృందంతో కలిసి పర్యటించారు. రోడ్డు వెంట నడుస్తున్న బాలికలను నిలిపి విద్యా బాగోగులు, రక్షణపై ఆరా తీశారు. అనంతరం ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో తనిఖీ చేశారు. విద్యార్థులను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. బాలికల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. బస్టాండ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పోకిరీల బెడద లేకుండా నిరంతరం వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు, బాలికలను వేధింపులకు గురి చేస్తే ఊచలు లెక్కబెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐలు మహేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మధు, నందీశ్వర్‌రెడ్డి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్: శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ (రాజేంద్రనగర్) కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌లుగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, చరిత్ర, పొలిటికల్ సైన్స్, బాటనీ, జువాలజీ, గణితం, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టుకు, కామర్స్‌లో రెండు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలి తెలిపారు. సెట్ నెట్, పీహెచ్‌డీ లాంటి అదనపు అర్హతలు, బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం సంబంధిత ధ్రువ పత్రాలతో కళాశాలలో నేరుగా ఆరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆ పార్టీలవి మోసపూరిత హామీలు

- బీజేపీ నిజాలు చెప్పి ప్రజల మనసులను గెలుస్తోంది
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ కొండావిశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు: ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అబద్ధపు హామీలతో ఓట్లు వేయించుకుంటారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో జిల్లా స్థాయి స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రాన్ని ధ్వంసం చేశారన్నారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా అబద్ధపు మాటలు చెప్పి కాంగ్రెస్ బీఆర్ఎస్ ఓట్లు వేయించు కుంటారన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో తను తులం బంగారం, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామనలేదు. రైతుబంధు ఇస్తాననలేదు. ఎలాంటి హామీ ఇవ్వకుండానే ఎన్నికల ప్రచారం చేశానని, అయినా కూడా ప్రజలు తనను గెలిపించారని గుర్తు చేశారు. కేవలం ప్రధాని నరేంద్రమోదీ పేరుతోనే తను గెలిచానని వివరించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలన్నారు. ఈ సారి వికారాబాద్ జిల్లాలో బీజేపీ అధిక స్థానాలను గెలిచి జిల్లా పరిషత్‌ను కైవసం చేసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో తమకు పోటీ కాంగ్రెస్‌తోనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజశేకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్‌కుమార్, మాదవరెడ్డి, శివరాజ్, జిల్లా కన్వీనర్ బాలేశ్వర్‌గుప్తా, జిల్లా పార్టీ మాజీ అధ్యక్షురాలు సాహు శ్రీలత, నాయకులు నాగారం మల్లేశం, శ్రీలత, గాజుల శాంతు కుమార్, మనోహర్ రావు, బంటారం భద్రేశ్వర్ పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో రాణించాలి

మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాసరావు



ఫుడ్ ఫెస్టివల్, ఎస్ఎస్‌జీ మేళాను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

అనంతగిరి: మహిళలు స్వయం ఉపాధితో రాణించాలని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని ప్రధాన రోడ్డులో మున్సిపల్‌లో చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్, ఎస్ఎస్‌జీ ఉత్పత్తుల మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలు మరింత బలోపేతం కావాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, టీఎంసీ వెంకటేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు, మున్సిపల్ అధికారులు, పట్టణ మహిళ సమాఖ్య ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాపరాతి గనుల్లో ‘పవర్’ కట్

- లోకాయుక్త ఆదేశాలతో కదిలిన మైనింగ్ అధికారులు
- విద్యుత్ కనెక్షన్‌ను తొలగించిన సిబ్బంది



విద్యుత్ కనెక్షన్‌ను తొలగిస్తున్న సిబ్బంది

తాండూరు రూరల్: అక్రమ నాపరాతి గనులపై మైనింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. పలుమార్లు హెచ్చరించిన వ్యాపారులు వినకపోవడంతో కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. తాండూరు మండలం మల్కాపూర్ గ్రామ శివారులో సర్వే నంబర్ 75లో అక్రమంగా నాపరాతి తవ్వకాలు కొనసాగుతున్నాయని శాంతు అనే యువకుడు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఆయన హైదరాబాద్‌లోని లోకాయుక్తకు దరఖాస్తు చేశాడు. దీంతో లోకాయుక్త ఆదేశాల మేరకు శనివారం తాండూరు మైనింగ్ ఏడీ సత్యానారాయణ మల్కాపూర్ గ్రామ శివారులోని అక్రమ నాపరాతి గనులను పరిశీలించారు. అనంతరం అక్కడ సరఫరా అయ్యే విద్యుత్ కనెక్షన్‌ను సిబ్బందితో తొలగించారు. ఈ సందర్భంగా మైనింగ్ ఏడీ మాట్లాడుతూ..ప్రభుత్వ అనుమతి లేకుండా నాపరాతి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జనరల్ ఆస్పత్రి దిశగా అడుగులు

తాండూరుకు చేరిన 200 పడకలు

తాండూరు: కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కళాశాల కొంత కాలం పాటు తాండూరు పట్టణంలో నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా 200 పడకల జనరల్ ఆస్పత్రి అనివార్యమైంది. జిల్లా ఆస్పత్రిని జనరల్ హాస్పిటల్‌గా మార్చనున్నారు. ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం 200 బెడ్లు, మంచాలు రావడంతో వాటిని జిల్లా ఆస్పత్రిలో వేశారు. 170 సాధారణ పడకలు, 30 ఐసీ పడకలు వచ్చాయి. వాటిలో 10 ఐసీ పడకలను ఎంసీహెచ్‌లో ఏర్పాటు చేయగా, మిగతా వాటిని జీహెచ్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆనంద్ తెలిపారు.



జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన పడకలు